చెరువు అన్యాక్రాంతం



చెరువును ఆక్రమించి వర్జీనియా పొగాకు సాగు చేపట్టిన దృశ్యం

- యథేచ్ఛగా అక్రమ సాగు
- పట్టించుకోని అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్‌: ఏకంగా 101 ఎకరాలు చెరువు ఉన్నా రైతులకు ఏమాత్రం ఉపయోగకరంగా లేకుండా పోయింది. ఒక వైపు గట్టు తెగి చుక్కనీరు కూడా చెరువులో నిల్వ ఉండని పరిస్థితి, మరో వైపు పంటల అక్రమ సాగు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డ్యాం నిర్మాణం చేపట్టాలంటూ రైతుల విన్నపం నెరవేరలేదు. ఇది జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం చిన్న–పెద్దా చెరువు దుస్థితి.

అక్రమ సాగుకు అడ్డా.. చిన్న–పెద్దా చెరువు

జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో చిన్న–పెద్దా చెరువు అక్రమ సాగుకు అడ్డాగా మారింది. 101 ఎకరాలు ఉన్న ఈ చెరువులో ఇప్పటికే 40 ఎకరాల్లో వర్జీనియా పొగాకు సాగు చేపట్టగా, మరికొంత మంది పంటల సాగు కోసం భూమిని దున్నే పనిలో నిమగ్నమయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో సంభవించిన తుఫాన్‌ కారణంగా చెరువు గట్టు తెగిపోయింది. దీంతో చెరువులో నీరు నిల్వ లేకపోవడంతో చెరువు ఖాళీగా దర్శనమిస్తోంది. ఇదే అదునుగా చూసుకుని ఖాళీగా ఉన్న ఈ చెరువులో అక్రమ సాగుకు యత్నిస్తున్నారు. రైతుల సాగునీటికి ఉపయోగపడాల్సిన చిన్న–పెద్దా చెరువు అక్రమసాగు చేపట్టడంతో, చెరువు గర్భం తగ్గిపోయి ముందు ముందు ఎక్కడ సాగు నీటి కొరత ఏర్పడుతుందోనని చెరువుపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

డ్యాం నిర్మాణం చేపట్టాలి

చిన్న–పెద్దా చెరువుపై డ్యాం నిర్మించాలని రైతులు కోరుతున్నారు. అనేక మార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి డ్యాం విషయాన్ని తీసుకెళ్లామన్నారు. ముందుగా తెగిపోయిన గట్టు నిర్మాణం చేపట్టి చెరువులోని నీరు వృథాగా బయటకు పోకుండా చర్యలు చేపట్టి, అనంతరం డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రైతులు వేడుకొంటున్నారు. 500 ఎకరాల సాగుకు ఈ చెరువు నీరు ఉపయోగపడుతూ వచ్చిందని, గట్టు తెగి నీరు వృథాగా పోవడంతో చుక్క నీరు కూడా రైతులకు అందటం లేదని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

చెరువుల్లో ఎటువంటి పంటలు సాగు చేపట్టకూడదు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం చిన్న–పెద్దా చెరువును పరిశీలించి, అక్రమ సాగు చేస్తున్నట్లు తెలిస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశానుసారం వెంటనే చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, ఇరిగేషన్‌ శాఖ డీఈ, జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



వైఎస్సార్‌సీపీ అధినేతతో మల్నీడి బాబి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ వైఫల్యాలను సోషల్‌ మీడియా మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు జంగారెడ్డిగూడెం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మల్నీడి బాబి తెలిపారు. శుక్రవారం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసం వద్ద మల్నీడి బాబి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన చర్యలపై సూచించారన్నారు. త్వరలోనే పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుస్తానని వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారని బాబి తెలిపారు. అప్పటి వరకు క్షేత్రస్థాయిలో ఉండి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించినట్లు వివరించారు.

రేపు భగవద్గీత కంఠస్థ పోటీలు

జంగారెడ్డిగూడెం: హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలు ఈ నెల 8వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ సభ్యులు వెంకటేశ్వరరావు, తోట రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అశ్వారావుపేట రోడ్డు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీలు ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆరో అధ్యాయంపై పోటీలు నిర్వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు సంపూర్ణ భగవద్గీత కంఠస్థ పోటీలు కూడా నిర్వహింపబడతాయని ధర్మ ప్రచార పరిషత్‌ సభ్యులు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. వివరాలకు 9440610659, 9550805597 ఫోన్‌ నెంబర్లను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారిణికి ఆర్థిక సాయం



డిస్కస్‌త్రో క్రీడాకారిణి గోల్కొండ నీలిమకు ఆర్థిక సాయం అందజేస్తున్న రాయల్‌ క్లబ్‌ నిర్వాహకులు

చింతలపూడి: భువనేశ్వర్‌లో జరిగే డిస్కస్‌త్రో జూనియర్‌ నేషనల్స్‌లో పాల్గొనడానికి వెళుతున్న చింతలపూడికి చెందిన క్రీడాకారిణి గోల్కొండ నీలిమకు స్థానిక రాయల్‌ క్లబ్‌ నిర్వాహకులు రూ.15,000 ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం చింతలపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో నీలిమకు నగదును అందజేశారు. కార్యక్రమంలో రాయల్‌ క్లబ్‌ ఫౌండర్‌ చిక్కాల నాగేశ్వరావు, అధ్యక్షులు ఊసా సుబ్బారావు, సెక్రటరీ కురిశెట్టి విజయ్‌ కుమార్‌, ట్రెజరర్‌ ఆకుల రమేష్‌, పీఆర్‌వో గాంధీ, కొండపల్లి శేషగిరిరావు, గంధం శ్రీనివాసరావు, తోట పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ల నిర్మాణం ఆపాలి



ఇళ్ల సమీపంలో నిర్మిస్తున్న పొగాకు బ్యారన్‌

టి.నరసాపురం: పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బంది కలిగించే బ్యారన్‌ నిర్మాణం ఆపాలని మక్కినవారిగూడెం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టర్‌ కె.వెట్రిసెల్వికి గ్రామస్తులు దేవరపల్లి జగదీశ్వరరావు, సిరిమళ్ల వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బొప్పన నాగేశ్వరరావు అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా పొగాకు బ్యారన్‌ నిర్మాణం చేపడుతున్నారన్నారు. గ్రామానికే చెందిన బాలిన రాము సైతం బ్యారన్‌ కూరింగ్‌ చేయడానికి సన్నద్ధమయ్యారన్నారు. అధికారులు స్పందించి బ్యారన్‌ నిర్మాణం, క్యూరింగ్‌ పనులు నిలుపుదల చేయాలని కోరారు.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వైఎస్సార్‌సీపీ

ప్రజలు అభ్యంతరాలు చేస్తున్నప్పటికీ బ్యారన్‌ నిర్మాణం, క్యూరింగ్‌ పనులను చేయడం తాము వ్యతిరేకిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మక్కిన వెంకట గోపాలరావు, మక్కిన శ్రీనివాస్‌, మందలపు మూర్తి అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం

కొయ్యలగూడెం: కన్నాపురం అటవీశాఖ అధికారులు అక్రమంగా తరలిస్తున్న కలపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలవరం మండలం ఎల్‌ఎన్‌డీ పేట గ్రామ సమీపంలో టాటా ఏస్‌ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఇరవై ఒక్క బండారు కలప దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు సెక్షన్‌ అధికారి కరీమ్‌ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని కలప, వాహనాన్ని సీజ్‌ చేసి కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. కన్నాపురం సెక్షన్‌ అధికారి బి.దినేష్‌, స్పెషల్‌ డ్యూటీ సెక్షన్‌ అధికారి పోసారావు దాడుల్లో పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం ఉప్పల మెట్ట ప్రాంతంలో శుక్రవారం వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నిబంధనల మేరకు నడపాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా, హెల్మెట్‌ ధరించకుండా ఎవరైనా వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ కృష్ణబాబుతో పాటు ఏఎస్సై మంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాలకు విరాళాలు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ డాక్టర్‌ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఆలయ అభివృద్ధికి, అమ్మవారి వెండి చీర నిమిత్తం దాత తమ్మన వెంకటేశ్వరావు, లక్ష్మీ శమంతకమణి దంపతులు రూ.30,116 విరాళంగా అందజేశారని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయానికి..

ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి దాత తమ్మన వెంకటేశ్వరరావు, లక్ష్మీ శమంతకమణి దంపతులు విరాళం అందజేశారు. బవిరిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయానికి ధూప దీప నైవేద్యాల నిమిత్తం అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ తమ్మన వెంకటేశ్వరరావు, లక్ష్మీ శమంతకమణి దంపతులు రూ.15,116 అందజేసినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్‌ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల శాఖ కార్యవర్గ సమావేశం స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సంఘ నూతన కార్యవర్గ ఎన్నికను నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్‌: మండలంలోని గురవాయిగూడెం శివారు నీలాలమ్మ ఆలయం సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీ కొన్న ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మధు కాలికి తీవ్రగాయమైంది. జంగారెడ్డిగూడేనికి చెందిన మధు ఏలూరు వైపు వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే ఏలూరు తరలించి చికిత్స అందిస్తున్నారు.

శానిటేషన్‌పై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి



శానిటేషన్‌ నిర్వహిస్తున్న సిబ్బంది

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శానిటేషన్‌ అమలుపై దృష్టి సారించినట్లు సీతంపేట గ్రామ సర్పంచ్‌ తోట కూర పద్మావతి పేర్కొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో సీతంపేట గ్రామంలో దోమల మందు స్ప్రేయింగ్‌ పనులను ఆమె ప్రారంభించారు.

పేరెంట్‌, టీచర్స్‌ మీటింగ్‌పై సమీక్ష

కొయ్యలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించే మెగా పేరెంట్‌ టీచర్స్‌ మీటింగ్‌ విజయవంతం చేయడానికి కృషి చేయాలని డీఎల్‌డీవో ఎం.రాజు అధికారులను కోరారు. ఏర్పాట్లపై ఎంపీడీఓ కె.కిరణ్‌, తహసీల్దార్‌ కె.చెల్లన్న దొర, ఎంఈఓ జె.సురేష్‌బాబులతో కలిసి పలు పాఠశాలలను ఆయన పరిశీలించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడుఏకలవ్య పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థిని కుర్సా హేమలత మలేరియా జ్వరం బారిన పడడంతో పాఠశాలలోని విద్యార్థులకు కూడా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించామని డాక్టర్‌ మాధురి, మలేరియా సబ్‌యూనిట్‌ ఆఫీసర్‌ వి. పెద్దిరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ తెల్లం వెంకటలక్ష్మి, సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్‌, వైద్యసిబ్బంది, సూపర్‌వైజర్‌ వాసంతి, వెంకాయమ్మ, హెల్త్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫెన్సింగ్‌ ఏర్పాటు

వేలేరుపాడు: మండలంలోని పాత పూచిరాల పాఠశాలకు గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు కలిసి పాఠశాలకు ఫెన్సింగ్‌ ఏర్పాటు చేశారు. స్కూల్‌ చైర్మన్‌ పోట్ల మోహన్‌, వైస్‌ చైర్మన్‌ బంధం వెంకటరమణ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీంతో కంచె నిర్మించినట్లు తెలిపారు.

దేశాభివృద్ధికి అంబేడ్కర్‌ సేవలు ఎనలేనివి



బుట్టాయగూడెం: అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే



చింతలపూడి: అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కొయ్యలగూడెం: అంబేడ్కర్‌ చిత్ర పటంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కామవరపుకోట: అంబేడ్కర్‌ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రమేష్‌



జంగారెడ్డిగూడెం: అంబేడ్కర్‌ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్‌



టి.నరసాపురం: వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



పోలవరం రూరల్‌: అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్‌



ద్వారకాతిరుమల: అంబేడ్కర్‌ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎస్సై సుధీర్‌

చింతలపూడి: దేశాభివృద్ధికి, దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్‌ చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్‌ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్‌ విగ్రహాన్ని రాష్ట్రంలో నెలకొల్పి అంబేడ్కర్‌ వాదిగా నిరూపించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్‌, ఎంపీపీ డాక్టర్‌ బి.రాంబాబు నాయక్‌, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి సీహెచ్‌ జ్ఞానారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌ బొడ్డు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌ కొప్పుల నాగేశ్వరరావు, ఎ.సుబ్బారావు, వైఎస్సార్‌ సీపీ ట్రేడ్‌ యూనియన్‌ నాయకులు ఎం.ఇమ్మానియేలు, ఎస్సీ సెల్‌ మండల నాయకులు ఎస్‌.కాంతారావు, విద్యార్థి విభాగం మండల కన్వీనర్‌ మిరియాల దిలీప్‌, దారా పేర్రాజు, కె.వెంకటేశ్వరరావు, రిటైర్డ్‌ అడిషినల్‌ డీజీపీ పూరేటి విజయానంద్‌, దళిత హక్కుల ప్రొటెక్షన్‌ సెల్‌ నాయకులు కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో

జంగారెడ్డిగూడెం: దేశానికి దిక్సూచి లాంటి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్‌ చిరస్మరణీయుడని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో బత్తిన లక్ష్మి కార్యాలయంలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ దేశంలో స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో జీవించగలుగుతున్నామంటే అది అంబేడ్కర్‌ రాజ్యాంగం పుణ్యమేనన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద, ఎస్‌డీఎస్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో అంబేడ్కర్‌ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌ ముప్పిడి అంజనేయులు, వైసీపీ నాయకులు బత్తిన చిన్న తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో

టి.నరసాపురం: అంబేడ్కర్‌ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసిల్దార్‌ సాయిబాబు, ఎస్సై జయబాబు, వైద్యులు ఫణీంద్రబాబులు పిలుపునిచ్చారు. రుద్రకోటరాజుగూడెం, టి.నరసాపురం అంబేడ్కర్‌ యూత్‌ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్‌ వర్ధంతిని నిర్వహించారు. అలాగే బొర్రపాలెం ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్‌ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్జా సాగర్‌, అర్జా రాజేష్‌, గుండె మహారాజు, చిన్నం బుజ్జి, చిన్నం అర్జున్‌రావు, వీరరాఘవులు, అజయ్‌, మహేశ్వరరావు, రవి, వినోద్‌, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో

కామవరపుకోట: మండలంలో పలు గ్రామాల్లో అంబేడ్కర్‌ వర్ధంతిని నిర్వహించారు. తడికలపూడిలో జెడ్పీటీసీ కడిమి రమేష్‌ ఆధ్వర్యంలో బస్టాండ్‌ దగ్గర ఉన్న అంబేడ్కర్‌ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో అంబేడ్కర్‌ యువజన సంఘం నాయకులు, అంబేడ్కర్‌ అభిమానులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో

కొయ్యలగూడెం: భారతరత్న బీఆర్‌ అంబేడ్కర్‌ 68వ వర్ధంతి కార్యక్రమం మండల వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులు అంబేడ్కర్‌ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించి, నివాళులర్పించారు. అచ్చుతాపురం, కన్నాపురం, గవరవరం, పరింపూడి, రాజవరం బయ్యన్నగూడెం గ్రామాలలోని అంబేడ్కర్‌ విగ్రహాల వద్ద రాజకీయ పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్‌లో

పోలవరం రూరల్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతి సందర్భంగా పోలవరం తహసీల్దార్‌ కార్యాలయం వద్ద తహసీల్దార్‌ ఆర్‌ఎస్‌వీ రాజు అంబేడ్కర్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌ ఆశయ సాధనలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలవరం మండల ప్రెస్‌ క్లబ్‌ అధ్యక్షులు సొబ్బన రాజశేఖర్‌, మిడియం వెంకటస్వామి, బచ్చల వెంకటరమణ, కుంజం రాంబాబు, పిల్లి నాగరాజు, దేశా బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం నడుస్తుంది

బుట్టాయగూడెం: ఏపీలో అంబేడ్కర్‌ రాజ్యాంగం కాకుండా కూటమి ప్రభుత్వ పాలనలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. భారత రాజ్యాంగ నేత బీఆర్‌ అంబేడ్కర్‌ 68వ వర్ధంతి కార్యక్రమం ముప్పినవారిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు అంబేడ్కర్‌ విగ్రహానికి, మహానేత వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో అంబేడ్కర్‌ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్‌ చేస్తూ కేసులు పెట్టి హత్యలు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్‌ నాయకులు ఆరేటి సత్యనారాయణ, వైస్‌ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు తెల్లం వెంకటలక్ష్మి, పొడియం లక్ష్మి, బన్నే బుచ్చిరాజు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో

ద్వారకాతిరుమల: అంబేడ్కర్‌ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్‌ అన్నారు. మండలంలోని ద్వారకాతిరుమల, దొరసానిపాడు, గుండుగొలనుకుంట, ఎం.నాగులపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వర్ధంతి కార్యక్రమాల్లో భరత్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్‌ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతోపాటు, దేశానికి మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్‌ అని కొనియాడారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవం



కొయ్యలగూడెం: సుబ్బారాయుడు



ద్వారకాతిరుమల: పల్లకీ వాహనంలో కొలువైన శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరుడు

కొయ్యలగూడెం: కార్తికేయుడి కల్యాణోత్సవం శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల వద్ద కనుల పండువగా ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాతిగాంచిన బయ్యన్నగూడెంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంతో పాటు కొయ్యలగూడెంలోని తాడేపల్లిగూడెం రోడ్డులో ఉన్న సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం, టెంపుల్స్‌ సెంటర్‌, కన్నాపురంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయాలలో రాత్రివేళ కల్యాణోత్సవాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పల్లకీ సేవ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన చెరువు వీదిలోని శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు.

బుట్టాయగూడెం: మండలంలోని నందాపురం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, స్థానిక త్రిపుర సుందరీ సమేత కామేశ్వరస్వామి వారి ఆలయాల్లో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి.

ఘనంగా శోభాయాత్ర

బుట్టాయగూడెం: మండలంలోని ముప్పినవారిగూడెంలో సీతాసమేత కోదండరామచంద్రమూర్తి దేవస్థానం విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన మహోత్సవ సందర్భంగా శుక్రవారం గ్రామంలో శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎక్సైజ్‌ అధికారుల దాడులు

కొయ్యలగూడెం: పోలవరం ఎక్సైజ్‌ సిబ్బంది శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై సీఐ ఆర్‌.సత్యవతి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎర్రంపేట గ్రామంలో కారంకి రామకృష్ణ అనే వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి, ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్సై ఎం.శ్రీనివాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.

సారా అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

టి.నరసాపురం: సారా కలిగియున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ ఫణికుమార్‌ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం ఎక్సైజ్‌ డిప్యూటీ కమిషనర్‌ బి.శ్రీలత ఆదేశాల మేరకు శుక్రవారం వల్లంపట్లలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామన్నారు.

రేపాకగొమ్ములో 20 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వేలేరుపాడు: జంగారెడ్డిగూడెం సర్కిల్‌ పరిధిలోని వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్‌ దాడులు నిర్వహించారు. గ్రామంలో 20 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.